సాక్షి మెదక్

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023

'పల్లా' కేనా..?



జనగామ నియోజక వర్గం నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డికే టికెట్ దక్కుతుందని జోరుగా ఊహాగా నాలు సాగుతు న్నాయి.

వివరాలు 8లో ▸



జీవితాలను మార్చేది ఓటే..

ఓటు జీవితాలను మారుస్తుందని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ కె.చంద్రశేఖర్ అన్నారు. వివరాలు 8లో ▸



యథేచ్ఛగా చెట్ల నరికివేత

శివ్వంపేట మండలం ఉసిరికపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికివేస్తున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం



గోమారంలో మన ఊరు- మన బడిని ప్రారంభిస్తున్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రయివేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. సోమవారం గోమారం, చండీ, పాంబండ గ్రామాల్లో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మన ఊరు- మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, నర్సాపూర్ ఆత్మకమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, లావణ్య, రమణగౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, శివులు, ఉమ, నర్సింహారెడ్డి, సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ



క్రిస్టియన్ భవనం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని క్రిస్టియన్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత సోమవారం భూమి పూజ చేశారు. అదేవిధంగా వీరానుమండ్ల దేవాలయ ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షల ప్రొసీడింగ్‌ను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేష్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, పురం రవి, కృష్ణాగౌడ్, వెంకట్‌గౌడ్, నాగిరెడ్డి, శేఖర్‌గౌడ్, భిక్షపతి, సుధాకర్, అర్జున్, మున్వర్, సాయిరాంగౌడ్, ఫాదర్ తదితరులున్నారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి



పల్లె దవాఖానను ప్రారంభిస్తున్న ఎంపీపీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): పల్లె దవాఖానాలలో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయనిర్మల అన్నారు. సోమవారం చిలప్‌చెడ్, చిట్కుల్, ఫైజాబాద్ గ్రామాలలో పల్లె దవాఖానాలను ఎంపీపీ వినోదరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. పల్లె దవాఖానాల్లో ప్రస్తుతం కొన్ని రకాల మందులు ఉన్నాయని, త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు, మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విశ్వంభర, సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, మాంతప్ప, మనోహర, ఎంపీటీసీలు మల్లమ్మ, సుభాష్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక




ఉపాధ్యాయులతో విష్ణువర్ధన్‌రెడ్డి

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి విష్ణువర్ధన్‌రెడ్డి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నర్సింలు సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ మండల, జిల్లా, సిద్దిపేట జోన్లలో ఖోఖో క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 15 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొంటాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఇక సమరమే..

మోగిన అసెంబ్లీ ఎన్నికల నగారా



- సర్వం సిద్ధం చేసిన జిల్లా అధికార యంత్రాంగం
- అమల్లోకి వచ్చిన కోడ్

మెదక్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. సోమవారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. షెడ్యూల్ విడుదలకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, చిరునామాల మార్పు వంటి ప్రక్రియ పూర్తి చేసి ఓటరు తుది జాబితాను విడుదల చేసింది. నోడల్ అధికారులను సైతం నియమించారు. ప్రవర్తన నియమావళి అమలుకు అవసరమైన కమిటీలను నియమించింది. పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

ఓటర్ల వివరాలు

జిల్లాలో 4,34,900 మంది ఓటర్లు ఉన్నారు. మెదక్ నియోజకవర్గంలో 2,14,118, నర్సాపూర్ నియోజకవర్గంలో 2,20,782 మంది ఓటర్లు ఉన్నారు. కొత్తగా 15,715 మంది ఓటర్లు నమోదయ్యారు. జిల్లావ్యాప్తంగా 579 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో 65 ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 514 బూత్‌లను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేశారు. నడవలేని వృద్ధులు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాలి

అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల్లో ఫ్లెక్సీలు పెట్టరాదు. అలాగే పోస్టర్లు, ఫ్లెక్సీలపై ప్రింటింగ్ ప్రెస్ వారి అడ్రస్ ముద్రించాలి. ఎన్నికల కరపత్రాలు ఎన్ని ముద్రించారనే వివరాలు తెలపాలి.

బీసీ, దళిత బంధులు బంద్

బీసీ బంధు, దళిత బంధు, మైనార్టీ బంధులను నిలిపి వేస్తారు. నిరంతర ప్రక్రియగా సాగే ఆసరా పింఛన్, బతుకమ్మల చీరల పంపిణీలాంటివి కొనసాగినా అందులో ప్రజాప్రతినిధులు పాల్గొనవద్దు. అధికారులు మాత్రమే పంపిణీ చేయాల్సి ఉంటుంది.

సీ–విజిల్ యాప్‌తో...

సీ–విజిల్ మొబైల్ యాప్‌ను ప్రజలు డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో అభ్యర్థులు ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు. ఘటనా స్థలం నుంచే వాటిని అప్‌లోడ్ చేయాలి.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఇతర అధికారులు

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దానిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఆపేయాలి. మతపరమైన స్థలాల్లో ప్రచారాలు చేయరాదు. ప్రభుత్వ స్థలాల్లోని ఫ్లెక్సీలు 24 గంటల్లో తొలగించాలి. ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దు. సమస్యలుంటే కంట్రోల్ రూం నంబర్ 1950కి ఫోన్ చేయండి.

సమన్వయంతో పని చేయాలి

మెదక్ కలెక్టరేట్: హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఐదు చెక్‌పోస్టులు: ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

జిల్లాలో 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. పెద్దశంకరంపేట టోల్‌గేట్, తూప్రాన్‌టోల్ గేటు, హవేళీఘనాపూర్ మండలం పోచమ్మరాళ్ సమీపంలో, రామాయంపేట హైవే, నర్సాపూర్ ఎక్స్ రోడ్డులో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. రూ.50 వేలకు మించి నగదు దొరికితే సీజ్ చేస్తాం. జిల్లాలో 38 లైసెన్స్ తుపాకులు ఉన్నాయి. వాటిలో కొన్ని బ్యాంకుల భద్రతకోసం ఉపయోగిస్తున్నారు. మిగతా వాటిని పోలీస్ స్టేషన్లలో అప్పగించాలి.

యూడైస్‌పై అవగాహన తప్పనిసరి

డీఈఓ రాధాకిషన్



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

పెద్దశకరంపేట(మెదక్): యూడైస్ ప్లస్ పోర్టల్‌పై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు యూడైస్ ప్లస్‌పై నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ముఖ హాజరు (ఎఫ్ఆర్ఎస్) యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, మండల నోడల్ అధికారి విజయ్‌కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వెంకటేశం, రాజేశ్వర్, విఠల్ తదితరులున్నారు.

విద్యాప్రమాణాలు పెంచాలి

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేలా చూడాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. సోమవారం ఆయన యూసుఫ్‌పేట, పాపన్నపేట ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే కింద నిర్వహించిన ఉన్నతి బేస్‌లైన్ టెస్ట్‌ల జవాబు పత్రాలను పరిశీలించారు. నవంబర్ నెలలో నిర్వహించబోయే నేషనల్ టెస్టుకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని కోరారు. ఆయన వెంట ఏఎంఓ సుదర్శనమూర్తి, సీపీడీ సెల్ నరేందర్ ఉన్నారు.

స్థానికేతరులకు సమస్యలేం తెలుసు?



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

హవేళీఘణాపూర్(మెదక్): కాంగ్రెస్, బీజేపీ పార్టీల తరఫున బరిలో దిగుతున్న స్థానికేతరులకు సమస్యల గురించి ఏం తెలుసని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం హవేళీఘణాపూర్‌తో పాటు సుల్తాన్‌పూర్, శమ్నాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడు వచ్చి ప్రలోభాలకు గురిచేసేవారిని ప్రజలు నమ్మరని అన్నారు. మరోమారు కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధికి కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కసిరెడ్డి, మాణిక్యరెడ్డి, సర్పంచ్‌లు శ్రీహరి, లింగం, రేణుక, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, మాజీ ఎంపీపీ కిష్టయ్య, నాయకులు రాంచంద్రారెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగరాజు, సంతోశ్ ఉన్నారు.

బస్సు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): పాఠశాలలు, కాలేజీలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండల పరిధి తిమ్మాపూర్ గ్రామ విద్యార్థులు రోడ్డెక్కారు. సోమవారం తిమ్మాపూర్ చౌరస్తా తూప్రాన్- నర్సాపూర్ హైవేపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామం నుంచి నిత్యం 100 మంది నర్సాపూర్, శివ్వంపేట, చిన్నగొట్టుముక్లలోని విద్యాలయాలకు చదువుకోవడానికి వెళ్తుంటారు. వారికి ఆర్టీసీ బస్సు సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపించారు. రెండు రోజుల క్రితం విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో పొలాల్లోకి దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో అక్కడ నుంచి వెళ్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ప్రజావాణికి 97 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 97 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్ఓ పద్మశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి : ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కొనుగోలు చేసిన భూమి పొజిషన్ అప్పగించకుండా ఇబ్బంది పెడుతున్నారని చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన తునికి శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. అలాగే చిలిపిచేడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన కోట కుమారస్వామి ఇంటి ఎదుట ఉన్న తన స్థలంలో సీసీ రోడ్డు వేయకుండా కొందరు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశాడు.

పింఛన్ ఇస్తలే..



నాకు 60 ఏళ్లు ఉంటాయి. పింఛన్ ఇవ్వడం లేదు. పలుమార్లు దరఖాస్తు చేసుకున్న. నడిచే ఓపిక లేకున్నా ఇక్కడికి వచ్చాను. అధికారులు కనికరించి ఫించన్ ఇప్పించాలి.

–జాజా వెంకటేశం, టేక్మాల్

పట్టించుకోవడం లేదు



పాపన్నపేట మండల కేంద్రం శివారులోని సర్వే నంబర్ 985ఈ/2లో 105 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఇది మా తాతల నాటి నుంచి ఉంది. కానీ ధరణిలో మిస్సింగ్ అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యను పరిష్కరించడం లేదు.

– శివప్పగారి ఈశ్వరప్ప, ముద్దాపూర్

ధరణిలో లేదు



చేగుంట మండలం వడియారం గ్రామ శివారులోని సర్వే నంబర్ 96/2, 97/2లలో 2.34 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి సంబంధించిన పాత పాస్‌బుక్‌లు, 2017 వరకు రికార్డులు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ధరణిలో నా పేరున భూమి కనిపించడం లేదు. వెంటనే సమస్య పరిష్కరించాలి.

–గులామ్, వడియారం

పరిశుభ్రతతో పట్టణ ప్రగతి

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరిస్తాం

- అభివృద్ధి పనులకు నిధులు
- త్వరలో ప్రారంభానికి కార్యాచరణ
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్ ఉమాదేవి

సాక్షి ఫోన్ ఇన్

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో నెల కొన్న సమస్యలను పరిష్కరిస్తాం. 12 వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం ఇటీవలే నిధులు మంజూరయ్యాయి. ఇందుకోసం కార్యాచరణ రూపొందించాం. పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధంపై ఇప్పటికే పలుమార్లు ప్రజలను చైతన్యపర్చాం. పరిశుభ్రతతోనే పట్టణ ప్రగతి సాధించవచ్చు.

– ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్



ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని పలు కాలనీల ప్రజలు మున్సిపల్ కమిషనర్ ఉమాదేవికి నేరుగా ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. దోమలు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధిలైట్లు, కోతులు, కుక్కల బెడద తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

➡ పట్టణంలో దోమల విజృంభిస్తుండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

– లక్ష్మణ్ యాదవ్, ఐదో వార్డు.

కమిషనర్: దోమల నివారణకు అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రజలు కూడా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.

➡ పట్టణంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు పూర్తిగా శిథిలమయ్యాయి. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించక దోమల పెరిగిపోయాయి.

– శంకర్‌గౌడ్, ఎనిమిదో వార్డు.

కమిషనర్: అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

➡ టీచర్స్ కాలనీలో రోడ్డు, మురుగు కాలువలు నిర్మించాలి. అలాగే వీధి లైట్లు వేయించాలి.

– మస్కూరి బాల్‌రాజ్, ఐదో వార్డు.

కమిషనర్: టీచర్స్ కాలనీలో రోడ్డు, మురికి కాలువల నిర్మాణానికి నిధులు వచ్చాయి. వీధిలైట్లు కూడా వేయిస్తాం.

➡ అన్ని వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలతోపాటు సీసీ రోడ్లు నిర్మించాలి.

– పోచమ్మల అశ్విని, రామాయంపేట

కమిషనర్: త్వరలో రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

➡ వెంకటేశ్వర కాలనీకి వెళ్లే దారిలో సీసీ రోడ్డు, మురుగు కాలువలు నిర్మించాలి. పూర్తిస్థాయిలో వీధిలైట్లు వేయించాలి.

-బొడ్డుల రాజు, నరేందర్, సాగర్, మూడో వార్డు.

కమిషనర్: నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

➡ రామాయంపేట తండాలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. అలాగే రహదారి నిర్మించాలి.

– గుగ్లోత్ రాజశేఖర్, తండావాసి

కమిషనర్: త్వరలో పనులు ప్రారంభమవుతాయి. పారిశుద్ధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

➡ పట్టణంలోని ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చివేయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టండి.

– నవాత్ కిరణ్‌కుమార్, రామాయంపేట

కమిషనర్: గుంతలను పూడ్చివేయిస్తాం.

➡ బస్టాండు వెనుక ఉన్న కాలనీలో కనీస సదుపాయాలు లేవు. యుద్ధ ప్రతిపాదికన రోడ్లు నిర్మించాలి.

– సుంకోజు దామోదర్, మూడో వార్డు.

కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారానికై కృషి చేస్తున్నాం. కార్యచరణ రూపొందిస్తున్నాం.

➡ జాతీయ రహదారి నుంచి కోమటిపల్లి వరకు రోడ్డు మరమ్మతుతోపాటు వీధిలైట్లు వేయించాలి.

– భానుచందర్, కోమటిపల్లివాసుడు

కమిషనర్: త్వరలో వీధిలైట్లు వేయించి రోడ్లు బాగు చేయిస్తాం.

➡ కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

– బొందుగుల రాజు, లక్ష్మీనారాయణ, మూడో వార్డు

కమిషనర్: నిబంధనల మేరకు కోతులు, కుక్కలను హతమార్చొద్దు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

➡ డంప్ యార్డు నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉండటంతో దుర్గంధం వ్యాపిస్తుంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

– అల్లాడి వెంకటేశ్, ఆరోవార్డు.

కమిషనర్: డంప్ యార్డు నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇది ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో చెత్త తరలించే వాహనాలు అక్కడికి వెళ్లడానికి ఇబ్బంది ఎదురవుతుంది.

పేదల గుడిసెలు తొలగింపు

బాధితులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని హమాలీ కాలనీ 248/1 సర్వే నెంబర్‌లో కొంత మంది నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. 2005లో పట్టాలు కూడా పొందారు. అయినా సోమవారం మున్సిపల్ కమిషనర్ తన సిబ్బందితో కలిసి పోలీసు బందోబస్తు మధ్య గుడిసెలను తొలగించారు. గుడిసెవాసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నిలువ నీడలేక గుడిసెలు వేసుకొని బతుకుతున్న తమపై మీ జులుం ఏంటని, గుడిసెలు తొలగించవద్దని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వ స్థలం అని చెప్పినా అధికారులు ప్రస్తుతం మాట మార్చి లేఅవుట్ పార్క్ స్థలం అంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో స్థలాన్ని ఖాళీ చేసేది లేదని బైఠాయించారు.



జేసీబీని అడ్డుకుంటున్న బాధితురాలు

క్లుప్తంగా

తపాలా ద్వారా ఎన్నో సేవలు
ఏఎస్పీ అశోక్‌కుమార్


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): తపాలా ద్వారా కేంద్రప్రభుత్వం అందజేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనగామ సబ్ డివిజన్ ఏఎస్పీ అశోక్‌కుమార్ కోరారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ ఆవరణలో సబ్‌పోస్ట్ మాస్టర్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్న మొత్తాల పొదుపు పథకాలు, పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రూ.399 చెల్లించి రూ.10లక్షల బీమా సదుపాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి, ఎంపీఈఓ నరెందర్‌రెడ్డి, సబ్ పోస్ట్ మాస్టర్లు భాస్కర్, సత్తయ్య, అరుణ్‌కుమార్, పోస్టల్ సిబ్బంది మల్లారెడ్డి, బిక్షపతి, నర్సింహులు, నరేష్, అహ్మద్‌షరీఫ్, అంజలి, పావని, ఉపేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

‘అల్పాహారం’ ఎన్నికల కోసమే..
వైఎస్సార్ టీపీ విద్యార్థి నేత నరేష్

టేక్మాల్(మెదక్): బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన అల్పాహారం అనే పథకం కేవలం ఎన్నికల కోసమేనని వైఎస్సార్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టి.నరేష్ ఆరోపించారు. టేక్మాల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చాలా చోట్ల పాఠశాలలు, కళాశాలలు కూలిపోయే ప్రమాదం ఉన్నా ఎందుకు మరమ్మతులు చేయడం లేదని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రియాంబర్స్‌మెంట్ రాక విద్యార్థులు నానాఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యలు పట్టడం లేదా అని మండిపడ్డారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన


మాట్లాడుతున్న శాస్త్రవేత్త బీఎస్ రావు

చేర్యాల(సిద్దిపేట): ఆయిల్ పామ్ సాగుపై శాస్త్రవేత్త బీ.ఎస్.రావు రైతులకు అవగాహన కల్పించారు. శనిగరం మల్లేశం ఆయిల్ పామ్ ఫీల్డ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయిల్ పామ్ సాగులో చేపట్టివలసిన చర్యలు, సాగుకు అనుకూలమైన భూమి, వాతావరణం, పంటకాలం, పురుగుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఏఓ, ఏడీఏ రాధిక, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ సునీత, ఓఎస్డీ చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా ఆయిల్ పామ్ మేనేజర్ శంకర్, ఏఓ అఫ్రోజ్, కొమురవెల్లి ఏఓ నరేష్, హార్టికల్చర్ ఆఫీసర్ పండరి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం ఐలయ్యకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న ఐలయ్య

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి జిల్లాపరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎలికట్టె ఐలయ్యను డాక్టరేట్ వరించింది. రాష్ట్రంలోని నాలుగు యూనివర్సిటీల నుంచి పన్నెండు పీజీలు పూర్తి చేసినందుకుగాను వెబిక్ యూనివర్సిటీ ఐలయ్యకు డాక్టరేట్ ప్రకటించింది. ఈ డాక్టరేట్ పట్టాను ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో టీఎస్‌ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్ ద్వారా అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఐలయ్యను అభినందించారు.





ఎన్నికల కోడ్ అమలులోకి హడావుడి మొదలైంది. మహనీయుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఈ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చిన్నశంకరంపేటలో రెవెన్యూ అధికారులు కోడ్ అమలుకు శ్రీకారం చుట్టారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయి పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాలకు ముసుగులు వేశారు. – చిన్నశంకరంపేట

‘పల్లా’ కేనా..?

- జనగామ ఎమ్మెల్యే బరిలో నలుగురు
- ఎమ్మెల్సీకి లైన్ క్లియర్ అయినట్టేనా?
- బరిలో ఉంటానంటున్న ముత్తిరెడ్డి
- సందిగ్ధంలో కార్యకర్తలు



సాక్షి, సిద్దిపేట: జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని ఎప్పుడు ప్రకటిస్తారని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. జనగామ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికే టికెట్ దక్కుతుందని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. ఆగస్టు 21న 115 మంది అభ్యర్థుల జాబితాను సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ జాబితాలో జనగామ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి టీఎస్ఆర్టీసీ చైర్మెన్ పదవిని బీఆర్ఎస్ పార్టీ కట్టబెట్టింది. పల్లాకు లైన్ క్లీయర్ చేసేందుకే ముత్తిరెడ్డికి ఆ పదవిని ఇచ్చారని తెలుస్తోంది. పల్లాకే జనగామ ఎమ్మెల్యే టికెట్ దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అనుకుంటున్నారు. దానికి తోడు ఇటీవల ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తానే బరిలో ఉంటానని ప్రకటించడంతో నియోజకవర్గంలో జోరుగా చర్చసాగుతుంది.

టికెట్ ఆశిస్తున్న నలుగురు నేతలు

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆప్కో మాజీ చైర్మెన్ మండల శ్రీరాములు, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం కుమారుడు కిరణ్ కుమార్ టికెట్ ఆశిస్తున్నట్టు సమాచారం. వాళ్లు నాలుగు వర్గాలుగా విడిపోయి గ్రూప్‌లుగా ఉంటున్నారు. ఎవరికి వారు తమకే అవకాశం వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు.

సమావేశాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ పల్లా

జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్‌లో జరిగిన సమావేశంలో చేర్యాల రెవెన్యూ డివిజన్ కావాలని కార్యకర్తలు కోరడంతో డివిజన్ ఏర్పాటు బాధ్యతను తానే తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సమాచారం. గతంలో సైతం రెండు మార్లు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు.

ముత్తిరెడ్డి వ్యాఖ్యలతో..

టీఎస్ఆర్టీసీ చైర్మెన్‌గా యాదగిరిరెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో తానే బరిలో ఉంటాను అని చెప్పారు. దీంతో ఎమ్మెల్యేను కాదని ఎమ్మెల్సీ దగ్గరికి వెళితే ఎలా? అనే సందిగ్ధంలో కార్యకర్తలు పడ్డారు. కొందరు కార్యకర్తలయితే తటస్థంగా వ్యవహరిస్తున్నారు.అభ్యర్థిని త్వరగా ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.



పండ్ల లారీ బోల్తా

తూప్రాన్: అరటి పండ్ల లోడ్‌తో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఒక లారీ జాతీయ రహదారిపై బోల్తాపడింది. పండ్లలోడ్‌తో వెళ్తున్న లారీ గీతా కళాశాల వద్ద బోల్తా పడడంతో భారీగా ట్రాఫిక్ జామయిందని పోలీసులు తెలిపారు. క్రేన్ సహాయంతో లారీని పక్కకు తీయించి ట్రాఫిక్ క్లియర్ చేశామని వారు తెలిపారు.

హత్యకేసులో జీవిత ఖైదు
ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మిశారద తీర్పునిచ్చినట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీకి చెందిన సుబ్రమణ్యం హత్య కేసులో నిందితుడైన జడపిట్టల హనుమంతుపై నేరం రుజువు కావడంతో సోమవారం కోర్టు శిక్ష విధించింది. పూర్తి ఆధారాలను సేకరించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఆమె అభినందించారు.

జీవితాలను మార్చేది ఓటే..

మెదక్ మున్సిపాలిటీ: ఓటు ఒక్కటే మనకు ఉన్న ఆయుధం.. ఓటు ద్వారానే మంచి నాయకులను ఎన్నుకుంటాం అదే మన జీవితాలను మారుస్తుందని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ కె.చంద్రశేఖర్ అన్నారు. విద్యార్థి, నిరుద్యోగ యువతలో ఓటుపై చైతన్యం తీసుకురావడంలో భాగంగా చేపట్టిన 33 జిల్లాల చైతన్య యాత్ర రెండో రోజు సోమవారం మెదక్ చేరింది. శ్రీనివాస డిగ్రీ కాలేజీలో విద్యార్థి, నిరుద్యోగ యువతతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఓటు ద్వారా మాత్రమే రాజకీయాలను మార్చాలని పిలుపునిచ్చారు. ఆ రాజకీయాలతోనే మన జీవితాలు ముడిపడి ఉన్నాయన్నారు. ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి మోహన్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో లెక్చరర్లు, 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

పాముకాటుకు ఒకరి బలి

అల్లాదుర్గం(మెదక్): పాము కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్లాపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ముస్లాపూర్ గ్రామానికి చెందిన భూమయ్య(52) ఆదివారం రాత్రి భోజనం చేసి తన ఇంట్లో పడుకున్నాడు. ఇంట్లోకి ప్రవేశించి ఒక కట్ల పాము కాటు వేయడంతో భూమయ్య నిద్ర నుంచి మేలుకుని పామును చంపివేశాడు. కుటుంబ సభ్యులు అయనను అదే రాత్రి జోగిపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మెదక్ పట్టణం కోలిగడ్డ వీధికి చెందిన టేక్మాల్ నరేష్(32), అతని స్నేహితుడు భీమరి ఉదయ్‌రాజ్‌తో కలిసి బైక్ పై శనివారం ఏడుపాయలలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం బైక్ పై రాత్రి మెదక్‌కు పయనమయ్యారు. వారి బైకు మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి పోతంశెట్టిపల్లి గ్రామ శివారు హనుమాన్ బండల్ మూలమలుపు వద్దకు రాగానే మెదక్ వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని 108 వాహనంలో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నరేష్ మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. ఉదయ్ రాజ్ పరిస్థితి కూడా విషమించటంతో అతన్ని మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు.

జహీరాబాద్‌లో ఎన్నికల వేడి

నియోజకవర్గంలో ఊపందుకున్న ప్రచారం

జహీరాబాద్ : నియోజకవర్గంలో అప్పుడే ఎన్నికల వేడి మొదలైంది. ప్రధాన రాజకీయ పార్టీల నేతలు అస్త్ర శస్త్రాలతో ఎన్నికలకు రెడీ అయ్యారు. ఇప్పటికే ప్రచారాన్ని మొదటిపెట్టారు. ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఇటీవల విస్తృతంగా పర్యటించారు. మరో మారు ఎమ్మెల్యేగా కె.మాణిక్‌రావును గెలిపించాల్సిందిగా సభా వేదికపై నుంచి ప్రజలను మంత్రి హరీష్‌రావు అభ్యర్థించారు. ఆయన పక్కా లోకల్ అని, స్థానికుడిని గెలిపిస్తేనే సమస్యలు తీరుతాయని ఈ సందర్భంగా ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తావించారు.

అసమ్మతి నేతల బుజ్జగింపులు..

బీఆర్ఎస్ కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకువచ్చి అభ్యర్థిని గెలిపించుకునేందుకు గాను రహస్య సమావేశాలను నిర్వహించారు. బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్‌ను నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన మండల, పట్టణ స్థాయిలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశాలను నిర్వహించారు. వారి నుంచి అభిప్రాయాలను సేకరించారు. గెలిచేందుకు ఉన్న అవకాశాలు ఏమిటీ, అందుకు ఏం చేయాలనే విషయంపై ఆరా తీశారు. అసంతృప్తితో ఉన్న పార్టీ కేడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి పనిచేయించుకునేలా దేవిప్రసాద్ శ్రమిస్తున్నారు. ముఖ్యులకు అభివృద్ధి పనుల కాంట్రాక్టులను ఇస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. గ్రామాలు, పట్టణంలో వార్డుల వారీగా సమావేశాలు జరిపారు. పార్టీ అభ్యర్థిత్వం విషయంలో బీఆర్ఎస్ శ్రేణుల నుంచి వచ్చిన అసంతృప్తిని చల్లార్చేందుకు మంత్రి హరీశ్‌రావు ఇటీవల శంకర్‌పల్లి సమీపంలోని రిసార్ట్‌లో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని గెలిపించుకోవడం అంత సులువైన పని కాదని మంత్రికి చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఒక అంచనాకు వచ్చిన ఆయన నష్టనివారణ చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉందనేది ప్రచారం.

గ్రామాల్లో కాంగ్రెస్ ముమ్మర ప్రచారం

కాంగ్రెస్ తరఫున మాజీ మంత్రి చంద్రశేఖర్ ఇప్పటికే గ్రామాల వారీగా సభలను నిర్వహిస్తున్నారు. న్యాల్‌కల్ మండలంలో ప్రచారం పూర్తి చేశారు. అధిష్టానం ఆయన వైపే మొగ్గు చూపిస్తోందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అధికారికంగా మొదటి జాబితాలోనే చంద్రశేఖర్ పేరు ఉండనుందని అంటున్నారు. ప్రత్యర్థి పార్టీలు మాత్రం స్థానికేతరుడని ప్రచారం చేస్తున్నాయి. ఆయన మాత్రం తన సొంత గ్రామం కోహీర్ మండలంలోని రాజనెల్లి అని ప్రచారం చేసుకుంటున్నారు. తెలియని వారు ఉంటే గ్రామానికి వెళ్లి అడిగితే తెలుస్తుందని సమాధానమిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ టికెట్‌ను గట్టిగా ఆశిస్తూ వచ్చారు. తాము స్థానికులం అయినందున సానుకూలంగా స్పందించాలని అధిష్టానాన్ని కోరారు. తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా పనిచేస్తామని చెబుతున్నారు.

అభ్యర్థి ఎంపికలో బీజేపీ తలమునకలు

అభ్యర్థి ఎంపిక విషయంలో బీజేపీ ఇంకా నిర్ణయానికి రాలేదు. పలువురు టికెట్ ఆశిస్తున్నా.. ప్రధాన పోటీ మాత్రం.. చింతలగట్టు సుధీర్‌కుమార్, రాంచందర్ రాజనర్సింహాల మధ్యే ఉంది. తాజాగా సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ బీజేపీలో చేరగా ఆయన పేరూ పరిశీలనలోకి రానుందనే ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ వసంత్ బీజేపీ టికెట్ దక్కించుకుని ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఉద్దేశంతోనే పార్టీలో చేరారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

బీఎస్పీ అభ్యర్థిగా గోపి

బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) నుంచి జంగం గోపి పేరును పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. దీంతో ఆయన పార్టీలో చేరికలపై దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి సుమారు 20 వేల ఓట్లను సాధించాడు. పార్టీలో జరిగిన పరిణామాల వల్ల బీఎస్పీలో చేరి టికెట్ దక్కించుకున్నారు. ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు సిద్దిపేట జిల్లా బాలబాలికల విభాగంలో క్రీడాకారుల జట్లను ఎంపిక చేసినట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం బాలబాలికల క్రీడా జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుర, బాలికల విభాగంలో మొత్తం 60 మంది క్రీడాకారులు హాజరు కాగా వారిలో ప్రతిభ కనబర్చిన వారిని ఒక్కో జట్టుకు 18 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ నెల 15, 16, 17 తేదీలలో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో బాలికల జట్టు, 19, 20, 21 తేదీలలో తూప్రాన్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో బాలుర జట్లు పాల్గొననున్నట్లు వివరించారు. క్రీడాకారులు తమ ప్రతిభను చూపి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ కార్యదర్శి రేణుక, విద్యానికేతన్ ప్రిన్సిపాల్ రాయప్ప, పీఈటీలు వెంకటేష్, బాబు, నవీన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఇద్దరి ఆత్మహత్య

కుటుంబ కలహాలతో...


మహేందర్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం కూచనపెల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగ మహేందర్‌రెడ్డి(55) మనస్తాపంతో ఆదివారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మహేందర్‌రెడ్డి భార్య మాధవి ఆరు నెలల కిందట కుటుంబ కలహాల వల్ల పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. భార్య మరణించడంతో మనోవేదన చెందిన ఆత్మహత్యకు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మహేందర్‌రెడ్డి సోదరుడు రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు.

మద్యానికి బానిసై ..


శివ ప్రసాద్

దౌల్తాబాద్(దుబ్బాక): మద్యం మత్తులో యువకుడు పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ గ్రామానికి చెందిన పోచమైన శివప్రసాద్(30) మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య లావణ్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శివ ప్రసాద్ మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగాడని అతడి తల్లి లక్ష్మి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ప్రసాద్ అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

ప్రైవేట్ బస్సు బైక్‌ను ఢీకొని..


దుర్గాప్రసాద్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: ప్రైవేట్ బస్సు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒక యువకుడు మృతిచెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం నర్సాపూర్ – హైదరాబాద్ జాతీయ రహదారిలోని కొండాపూర్ హనుమాన్ ఆలయం సమీపంలో ఈ ఘటన జరిగింది. నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామానికి చెందిన ఎరుకలి దుర్గాప్రసాద్ (19). తన మిత్రుడు ప్రశాంత్‌తో కలిసి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి లోని హెట్రో కంపెనీలో పని చేసేందుకు బైక్ పై వెళ్తున్నారు. మీరు ప్రయాణిస్తున్న బైకను ఎదురుగా వస్తున్న ప్రవేట్ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ బైక్ ఢీ కొట్టాడు. దీంతో దుర్గాప్రసాద్, ప్రశాంత్‌కు తీవ్రగాయాలు కాగా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. స్థానిక వైద్యులు పరీక్షించి దుర్గాప్రసాద్ పరిస్థితి విషమంగా ఉందని వెంటనే హైదరాబాద్ తరలించాలని సూచించడంతో సూరారంలోని నారాయణ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి దుర్గాప్రసాద్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ప్రస్తుతం ప్రశాంత్ సంగాడిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బస్సు డ్రైవర్ పై చర్యలు తీసుకుని దుర్గాప్రసాద్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు బంధువులు నర్సాపూర్ – హైదరాబాద్ జాతీయ రహదారిలోని ఎస్‌బీఐ వద్ద ధర్నా చేశారు. అటుగా వెళ్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి బాధితులను సముదాయించి బస్సు యాజమాని నుంచి నష్టపరిహారం అందేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ధర్నాలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, నర్సంపేట సర్పంచ్ విజయభాస్కర్ రాజు, కాంగ్రెస్ నాయకులు మల్లేశం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడు..


నరేష్ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని కోలిగడ్డ వీధికి చెందిన టేక్మాల్ నరేష్(31) ఆదివారం ఏడుపాయల్లో విందులో పాల్గొని అతని స్నేహితుడు భీమరి ఉదయ్ రాజ్‌తో కలిసి బైక్‌పై తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో కొల్చారం మండలం మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి పోతంశెట్టిపల్లి గ్రామ శివారు హనుమాన్ బండల్ మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ నరేష్ మృతి చెందగా ఉదయ్‌రాజ్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

లారీ ఢీకొని...

హవేళిఘణాపూర్(మెదక్): బైక్‌పై వెళ్తున్న వారిని లారీ ఢీకొన్న ఘటనలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కుమార్తె ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటన మండల పరిధిలోని పోచారం గెస్ట్‌హౌస్ శివారులో చోటు చేసుకుంది. హవేళిఘణాపూర్‌కు చెందిన నల్ల రవి(35) తన కుమార్తె వర్షతో కలిసి కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామంలోని తన అత్తవారింటికి వెళ్లాడు. సోమవారం వారి గ్రామం హవేళిఘణాపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పోచారం గెస్ట్‌హౌస్‌శివారులోకి రాగానే మెదక్‌వైపు నుంచి వస్తున్న లారీ వారి బైక్‌ను ఢీకొట్టడంతో రవి అక్కడికక్కడే మృతి చెందగా వర్ష ప్రాణాలతో బయటపడింది. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ పరిశీలించి లారీని అదుపులోకి తీసుకున్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి..

మనోహరాబాద్(తూప్రాన్): చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం సిద్దిపేట్ జిల్లా వర్గల్ మండలం అనంతగిరి గ్రామానికి చెందిన గాలి ముత్యాలు (46) ఆరు నెలలుగా మనోహరాబాద్‌లో అక్క వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తు జీవిస్తున్నాడు. కాగా ముత్యాలు శనివారం సాయంత్రం చేపలు పట్టడానికి అని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో చెట్లగౌరారంలో ఉన్న ఆయన భార్య లతను అడగగా రాలేదని తెలపడంతో సోమవారం చుట్టు పక్కల వెతకగా మనోహరాబాద్ చెరువు కట్టపై బైక్ ఉండడంతో చెరువులో వెతకగా చెరువులో మృతదేహం లభించింది. భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో స్నానానికి వెళ్లి..


రాజు (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): దినకర్మలో భాగంగా చెరువులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు జారీపడి నీటమునిగి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట గ్రామానికి చెందిన రామప్పగారి రాజు(33), అప్పాజీపల్లి గ్రామానికి చెందిన భార్య సుజాత అమ్మమ్మ పద్మమ్మ దినకర్మకు అప్పాజీపల్లి గ్రామానికి వచ్చారు. రాజు సోమవారం ఉదయం స్థానిక చెరువులో స్నానం చేయడానికి వెళ్లాడు. స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలు జారీ నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు.

కారు ఢీకొని రెవెన్యూ సిబ్బందికి గాయాలు


దెబ్బతిన్న కారు

దుబ్బాకరూరల్: రెండు కార్లు ఢీ కొని రెవెన్యూ సిబ్బంది గాయపడిన ఘటన మండలంలోని అప్పనపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్ సిద్దిపేట నుంచి దుబ్బాకకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో సిద్దిపేటవైపు వెళ్తున్న మరో కారు ఎదురుగా రావడంతో రెండు కార్లు ఢీ కొన్నాయి. దీంతో గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మనస్తాపంతో మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఒక మహిళ అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం ప్రకారం.. కిష్టారెడ్డిపేట దుర్గానగర్‌లో ఉండే ఓ మహిళ కుటుంబ తగాదాలతో ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె కోసం గాలించారు. ఆచూకీ లభించక పోవడంతో సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.